నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 SANGAREDDY



మెదక్ కలెక్టరేట్ నుంచి పోలింగ్ సామగ్రితో బయలుదేరిన సిబ్బంది

# పోలింగ్‌కు రెడీ

## ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు శాసనమండలి ఎన్నికలు
- ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 70,713 మంది పట్టభద్రుల ఓటర్లు
- 7,249 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- ఎన్నికల్లో భారీగా డబ్బుల పంపిణీ

సిద్దిపేట, ఫిబ్రవరి 26( నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం(నేడు) పోలింగ్ జరగనున్నది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరిగే పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల స్థానం నుంచి 56మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఉపాధ్యాయ స్థానం నుంచి 15 మంది పోటీపడుతున్నారు. ఇప్పటికే పోల్ చీటీల పంపిణీ పూర్తయింది. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఆ పోల్ చీటీలో ఉంది.

### ఉమ్మడి మెదక్ జిల్లాలో...

ఉమ్మడి మెదక్ జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 70,713 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 47,849, మహిళలు 22,864 ఉన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 7,249 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 4,339, మహిళలు 2,910 మంది ఉన్నారు. పోలింగ్‌కు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వేయిలెన్స్ బృందాలు, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సూక్ష్మ పరిశీలకులు, రూట్ అధికారులు, నోడల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

### జోరుగా డబ్బుల పంపిణీ

కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ఏరులై పారింది. రెండు రోజుల నుంచి పోలింగ్ సమయం వరకు డబ్బుల పంపిణీ కొనసాగింది.ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. అయినా ఓటర్లను కలిసి డబ్బులు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక కీలక అభ్యర్థి ఓటుకు రూ. 5వేలు ఇవ్వగా, మరో కీలక అభ్యర్థి రూ 3వేల చొప్పున పంచారు. ఇద్దరు అభ్యర్థులవి కలిపి ఒక్క ఓటుకు రూ. 8వేల వరకు ఓటర్లకు ముట్టినట్లు తెలిసింది. ఇవికాకుండా ఇతర అభ్యర్థులు తృణమో ప్రణమో సమర్పించుకున్నట్లు తెలిసింది. మండల శాఖల ద్వారా ఉపాధ్యాయులు ఎక్కడ ఉంటే అక్కడికి పంపించారు. కొన్నిచోట్ల గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు అందించారని సమాచారం. బుధవారం మొత్తం ఓటర్లను మేనేజ్ చేసే పనిలో అభ్యర్థులు, వారి అనుచరులు నిమగ్నమైనట్లు తెలిసింది. ఇప్పటి వరకు గెలుస్తామనుకున్న ప్రధాన అభ్యర్థులు డైలామాలో పడ్డారు. ఈ డబ్బు ఎవరి కొంప ముంచుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఎన్నికల్లో డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు. ఉపాధ్యాయులై ఉండి అభ్యర్థుల వద్ద డబ్బులు తీసుకొని ఓటు వేయడం ఎంత వరకు కరెక్ట్ అని సాధారణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మార్గదర్శకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయులే ఇలా డబ్బుకు తమ ఓటును అమ్ముకోవడం ఎంత వరకు కరెక్ట్..? నలుగురు కలిసిన చోట ఇదే అంశంపై ప్రధాన చర్చ జరిగింది.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మెటీరియల్‌తో సిబ్బంది

### ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓటర్ల సంఖ్య

**1) ఉపాధ్యాయ ఓటర్లు**

| క్ర. | జిల్లా పేరు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|
| 1. | సిద్దిపేట | 2,020 | 1,192 | 3,212 |
| 2. | మెదక్ | 799 | 548 | 1,347 |
| 3. | సంగారెడ్డి | 1,520 | 1,170 | 2,690 |
| | మొత్తం | 4,339 | 2,910 | 7,249 |

**2) పట్టభద్రుల ఓటర్లు**

| క్ర. | జిల్లా పేరు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|
| 1. | సిద్దిపేట | 21,587 | 11,002 | 32,589 |
| 2. | మెదక్ | 8,879 | 3,593 | 12,472 |
| 3. | సంగారెడ్డి | 17,383 | 8,269 | 25,652 |
| | మొత్తం | 47,849 | 22,864 | 70,713 |



సంగారెడ్డి అంబేద్కర్ మైదానంలో పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

### సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 23, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 3,212 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 2,020 మంది, మహిళలు 1,192 ఉన్నారు. పట్టభద్రుల స్థానానికి మొత్తం ఓటర్లు 32,589 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 21,587 మంది, మహిళలు 11,002 మంది ఓటర్లు ఉన్నారు.

### సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 28, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 2,690 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,520, మహిళలు 1,170 మంది ఉన్నారు. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 25,652 మంది ఉన్నారు. వీరిలో 17,383 మంది పురుషులు, 8,269 మంది మహిళలు ఉన్నారు.

### మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలు 22 ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 21 ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 1,347 ఉన్నారు. వీరిలో పురుషులు 799 మంది, మహిళలు 548 మంది ఉన్నారు. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 12,472 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 8,879 మంది, మహిళలు 3,593 మంది ఉన్నారు.



రంగాయిపల్లిలో కాలువలో గోదావరి నీటికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# గంగమ్మకు పూజలు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్, రంగాయిపల్లి గ్రామాల వద్ద కాలువలోకి బుధవారం గోదావరి నీటిని వదిలిపెట్టారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గోదావరి జలాలకు పూజలు చేసి నీటిని వదిలారు. అనంతరం రైతులతో కలిసి ఆయన సెల్ఫీ దిగారు. నీళ్లు తెచ్చినందుకు రైతులు హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో హరీశ్‌రావు ఆప్యాయంగా మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

– చిన్నకోడూరు, ఫిబ్రవరి 26



ఏడుపాయల్లో దుర్గమ్మ దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

# శంభో శివ శంభో

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- ఉప్పొంగిన భక్తిభావం
- పలుచోట్ల జాతరలు ప్రారంభం

ఓం నమ:శివాయ..హరహర మహాదేవ..శంభో శంకర నామస్మరణతో జిల్లాలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. బుధవారం జిల్లాలో మహాశివరాత్రి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ ఆలయాల్లో దర్శనానికి గంటల కొద్ది సమయం పట్టింది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గాభవానీ మాత ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే జాతర వైభవంగా ప్రారంభమైంది. మంత్రి దామోదర రాజనర్సింహ దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. కొప్పోల్‌లోని ఉమాసంగమేశ్వరాలయం, సంగారెడ్డి జిల్లాలోని కేతకీ సంగమేశ్వరాలయం, అమీన్‌పూర్‌లోని బీరంగూడ మల్లికార్జున స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సిద్దిపేటలోని కోటిలింగాల ఆలయం, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం, పొట్లపల్లిలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం, కోహెడలోని ఆలయం, కూడవెల్లి రామలింగేశ్వరాలయం రద్దీగా మారాయి. రాత్రిపూట జాగరణలు, భజనలు, లింగోద్భవ పూజలు కొనసాగాయి.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 26

సంగారెడ్డిలోని పసరువాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కోటి ఎనిమిది రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన మహా శివలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు





సిద్దిపేటలోని కోటిలింగాల ఆలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న హరీశ్‌రావు

# రైతన్నకు సాగునీటి కష్టాలు



కొమురవెల్లిలో నీళ్లు లేక ఎండిన వరి పంట

కొమురవెల్లి, ఫిబ్రవరి 26: కొమురవెల్లి మండల కేంద్రంలో రైతన్నలకు సాగు కష్టాలు మొదలయ్యాయి. పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరిలోనే పంటకు నీళ్లు అందని పరిస్థితి వచ్చింది. కొమురవెల్లి మండల కేంద్రంలో రైతు మారబోయిన భిక్షపతి ఎకరం 10 గుంటల్లో వరి పంట వేశాడు. ఎండలు ముదరక ముందే వేసిన పంట కండ్ల ముందే ఎండిపోయింది. కేసీఆర్ పాలనలో చుట్టూ కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపడంతో 2ఎకరాల 20 గుంటలు పారేదని, గిప్పుడు అందులో సగం కూడా పారడం లేదని రైతు భిక్షపతి ఆందోళన వ్యక్తం చేశాడు.

# ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- స్వర్ణోత్సవాలకు రూ.లక్ష విరాళం ప్రకటన

సిద్దిపేట, ఫిబ్రవరి 26 : సిద్దిపేటలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం 50 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై బుధవారం ఆలయంలో సమీక్ష నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ఈ ఆలయం ఎంతో ప్రాశస్త్యం కలిగిందన్నారు. 1971 లో పెద్దజీయర్ స్వామి వారిచే ప్రతిష్ఠ జరిగిందని, 1991లో చినజీయర్ స్వామి స్వహస్తాలతో ఆలయ గోపుర ప్రతిష్ఠ జరిగినట్లు తెలిపారు. ఇప్పుడు అర్ధ శతాబ్దపు ఉత్సవాలు చినజీయర్ స్వామితో జరగడం మన అదృష్టమని, ఇందులో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని కోరారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములైన కొమ్మ వెంకటేశం, జిల్లా వెంకటేశం, సోహన్‌లాల్, పబ్బ చంద్రయ్య, వారి కుటుంబాలను, ఆలయాభివృద్ధికి పాటుపడిన వారిని సన్మానం చేసుకుందామని పిలుపునిచ్చారు. 5 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని హరీశ్‌రావు కోరారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో మే 21న కల్యాణోత్సవం, 22న మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలకు తనవంతుగా హరీశ్‌రావు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# ఆలయాల్లో హరీశ్‌రావు పూజలు

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 26 : సిద్దిపేట పట్టణంలోని ఉమాపార్థివ కోటిలింగాల ఆలయాన్ని బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ శివాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అర్చకులు, హరీశ్‌రావును ఆశీర్వదించగా, నిర్వాహకులు సన్మానించారు. అనంతరం మహా శివరాత్రి సందర్భంగా గ్రామంలో వెలిసిన శివాలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.



కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

# శివయ్య..ఈ సర్కారు మనసు మార్చయ్య

- డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ రుద్రాభిషేకాలు చేసిన గుమ్మడిదల జేఏసీ
- గుమ్మడిదలలో 16వ రిలే నిరాహార దీక్ష చేపట్టిన రెడ్డి సంఘం సభ్యులు
- దీక్షలు కొనసాగడానికి రూ.లక్షన్నర విరాళం
- నల్లవల్లి 22వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన ముదిరాజ్ సంఘం యువకులు
- గుమ్మడిదలలో కలశాలతో మహిళా, రైతు జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ



గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా కలశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు, మహిళలు



గుమ్మడిదలలో చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు చేసిన రైతు జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 26: ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మహాశివరాత్రి పండుగ రోజున నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. గుమ్మడిదలలో జేఏసీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. రైతు, మహిళా జేఏసీ అధ్యక్షులు చిమ్ముల జైపాల్‌రెడ్డి, ఇందుల మల్లమ్మ, అఖిలపక్ష నాయకులు కలిసి జాతీయ రహదారి నుంచి గ్రామంలో గుమ్మిడిదలలో కలశాలతో ర్యాలీగా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నా రు. డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ మనుసు మార్చండి శివా అంటూ మహిళా జేఏసీ నాయకులు కలశాలతో శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. గుమ్మిడిదలలో అంబేద్కర్ చౌరస్తా వద్ద 16వ రోజు రిలే నిరాహార దీక్షలో రెడ్డి సం ఘం సభ్యులు పాల్గొన్నారు.రిలే దీక్షలకు నిర్విరామంగా కొనసాగడానికి రెడ్డి సంఘం రూ.లక్షన్నర విరాళంగా జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డికి అందజేసింది. ఆందోళనల్లో జేఏసీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, చిమ్ముల నర్సింహారెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆంజనేయులు, రెడ్డి సంఘం నేతలు మద్దుల బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పోచుగారి శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమణారెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, జైపాల్ రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్యారానగర్-నల్లవల్లి గ్రామస్తుల నిరసన...

నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తున్న అటవీ ప్రాంతంలో జీవగంగను తలపించే బుగ్గకుంట ఉంది. ఇక్కడ ఏడాది పొడవునా నీరు ప్రవహిస్తుంది. ఈ బుగ్గకుంట సమీపంలో శివలింగం ఉంది. దీనిని బుధవారం నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల జేఏసీ నాయకుల, యువకులు దర్శించుకున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు కాకుండా చూడండి తండ్రి అని మొక్కుకున్నా రు. అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు నీరు అందించే బుగ్గకుంట కలుషితం కాకుండా ప్రభుత్వం స్పందించాలని కోరుకున్నారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం యువకులు 22వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో యువకులు కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, ఫయాజ్‌షరీఫ్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.





రిలే దీక్షలు కొనసాగడానికి విరాళం అందజేస్తున్న రెడ్డి కులస్తులు (ఇన్‌సెట్‌లో) నల్లవల్లిలో 22వ రోజు దీక్షలో ముదిరాజ్ సంఘం యువకులు

# మల్లన్న క్షేత్రం కిటకిట

## పెద్దపట్నం వీక్షించేందుకు భారీగా వచ్చిన భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 26: మహా శివరాత్రిని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్దపట్నం కార్యక్రమాన్ని ఆలయవర్గాలు రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించనుండడంతో కనులార వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గురువారం వేకువజామున 4గంటల వరకు 155 మంది ఒగ్గు పూజారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే పెద్దపట్నం చూస్తూ భక్తులు శివరాత్రి జాగరణ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ పాలక మండలి, ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు నిరేశ్, రాజు, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



మహామండపంలో పట్నంపై బోనం పెట్టి మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు